

సెల్ : 94920 33365



# నేటి దర్శిని

WWW.NETIDARSHINI.COM

PRGI NO: APTEL/26/A5450

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...





Contact Number 9059328777




విజయవాడ సోమవారం 21-09-2026 సంపుటి: 02 సంచిక : 81 వెల: 2 రూ పేజీలు :04 సంపాదకులు: కట్ట హిమ పావని

Vijayawada Monday 21-09-2026 Volume :02 Issue: 81 RS: 2 Pages:04 Editor : Katta HimaPavani


## సౌదీకి సాయం చేస్తే ఖబడ్దార్..

- పాకిస్థాన్, టర్కీలకు హౌతీల వార్నింగ్
- సౌదీకి సైనిక సాయం చేస్తే ఉక్కుపిడికిలితో బదులిస్తామని హెచ్చరిక
- పాకిస్థాన్, టర్కీ తటస్థంగా ఉండాలని హౌతీల సూచన
- యుద్ధంలో జోక్యం చేసుకుంటే రెండు దేశాలపైనా దాడులంటూ వార్నింగ్
- సౌదీ, పాక్, టర్కీ మధ్య రక్షణ ఒప్పందంపై హౌతీల ఆగ్రహం
- మూడు దేశాల్లో ఏ ఒక్కరిపై దాడైనా అందరిపై దాడిగానే ఒప్పందం
- సౌదీ భూభాగ రక్షణకు సిద్ధమని పాక్ ప్రకటన
- సౌదీకి సైనిక, సాంకేతిక సాయం అందించేందుకు టర్కీ సంసిద్ధత
- సౌదీ ఇంధన వనరులు, నగరాలపై హౌతీల క్షిపణి, డ్రోన్ దాడులు



02

## ఇరాన్ యుద్ధానికి అమెరికా ఖర్చు రూ.4.32 లక్షల కోట్లు

- ఏడు నెలల్లో 45.1 బిలియన్ డాలర్లు ఖర్చు చేసినట్లు ని కాంగ్రెస్‌కు ట్రంప్ ప్రభుత్వం వెల్లడి
- యుద్ధం కోసం 43.6 బిలియన్ డాలర్ల వ్యయం
- చమురు కోసం మరో 1.5 బిలియన్ డాలర్లు ఖర్చు
- ఫిబ్రవరి 28 నుంచి సెప్టెంబర్ 2 వరకు లెక్కలు
- ఇప్పటి ఖర్చు అంచనా మాత్రమేనని ప్రభుత్వం స్పష్టీకరణ
- ధ్వంసమైన స్థావరాలు, భవనాల మరమ్మతు ఖర్చులు ఇందులో లేవు
- క్షిపణుల అడ్డుగోలు వ్యవస్థలకే భారీగా వ్యయం
- చమురు సరఫరా సమస్యలతోనూ ఆర్థిక భారం
- యుద్ధం కొనసాగితే ఖర్చు మరింత పెరిగే అవకాశం

02







## ఏపీ, తెలంగాణ మధ్య ప్రత్యేక రైళ్లు

- దసరా పండుగ రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే ప్రకటన
- చర్లపల్లి - శ్రీకాకుళం మధ్య మొత్తం 16 సర్వీసులు
- అక్టోబర్, నవంబర్ నెలల్లో అందుబాటులోకి
- విజయవాడ, రాజమండ్రి, విజయనగరం మీదుగా ప్రయాణం
- చర్లపల్లి - నాగర్కోయిల్ మార్గంలో మరో 10 ప్రత్యేక సర్వీసులు

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి

దసరా పండుగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. రద్దీని నివారించేందుకు చర్లపల్లి - శ్రీకాకుళం మధ్య 16 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ రైళ్లను అక్టోబర్, నవంబర్ నెలల్లో అందుబాటులోకి తీసుకురానున్నారు. షెడ్యూల్ వివరాల ప్రకారం.. రైలు నంబర్ 07037 (చర్లపల్లి - శ్రీకాకుళం) అక్టోబర్ 6, 13, 20, 27 తేదీలతో పాటు నవంబర్ 3, 10, 17, 24 తేదీల్లో నడవనుంది. తిరుగు ప్రయాణంలో రైలు నంబర్ 07038 (శ్రీకాకుళం - చర్లపల్లి) అక్టోబర్ 7, 14, 21, 28 మరియు నవంబర్ 4, 11, 18, 25 తేదీల్లో ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ,

-మిగతా 2లో


### ఎల్ నినోను ముందే అంచనా

# వేసుకున్నాం


**ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలి**

- రైతులను ఆదుకోవడం, నిత్యావసరాల ధరల నియంత్రణే ప్రధాన లక్ష్యం
- బియ్యం, ఉల్లి, పామాయిల్, కందిపప్పు ధరలు అదుపులో ఉంచాలని ఆదేశం
- డిమాండ్‌కు తగిన పంటల సాగు, వర్షాధార వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి
- విపత్తును ఎదుర్కొనేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు, ఆర్డీఓలకే సిబ్బంది టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

ఎల్ నినోను విపత్తుగా కాకుండా సవాలుగా ఎదుర్కొనేలా ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. రైతును కాపాడటంతో పాటు అత్యవసరాల ధరలు అదుపు తప్పకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. డిమాండ్‌కు అనుగుణంగా పంటల సాగు, పంటల బీమా, హార్టికల్చర్ ఉద్యాన పంటలకు రక్షణ, తాగునీరు-పశుగ్రాసం అందుబాటులో ఉంచడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఎల్ నినో ప్రభావాన్ని తట్టుకునేందుకు ఇప్పటికే సిద్ధం చేసిన యాక్షన్, కంటింజెన్సీ ప్రణాళికలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.



02



02


### రష్యాపై విరుచుకుపడిన

## ఉక్రెయిన్

- 1,600కుపైగా డ్రోన్లతో దాడి.. ఇద్దరు మృతి, పలువురికి గాయాలు
- ధ్వంసమైన ఆయిల్ రిఫైనరీలు.. ఎగసిపడిన మంటలు
- టార్గెట్లలో పారిశ్రామిక, లాజిస్టిక్ పార్కులు
- నివాస భవనాలపైనా దాడులు.. పలువురు మృతి
- 450 డ్రోన్లను కూల్చేశాం.. మాస్కో మేయర్ ప్రకటన
- దాడుల వీడియోలను విడుదల చేసిన జెలెన్‌స్కీ
- పార్లమెంట్ ఎన్నికల వేళ ఉద్రిక్తతలతో ఆందోళన


## ఇటలీ పాఠశాలల్లో బుర్ఖా, నిఖాబ్‌పై నిషేధం







02

## విదేశాంగ శాఖ మంత్రికి 'సర్' నోటీసు..!







02



## 17 ఏండ్లలో లేనంతగా కరువు

- ఎల్ నినోతో 15 శాతం లోటు వర్షపాతం నమోదు
- తెలంగాణలో 22%, ఏపీలో 45% తక్కువగా రికార్డు
- కర్ణాటకలో 31 శాతం.. కేరళలో 28 శాతం లోటు
- శనివారం నుంచి నైరుతి రుతుపవనాల తిరోగమనం ప్రారంభం
- పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం.. రైతులకు ఇబ్బందులు
- బంగాళాఖాతంలో అల్పపీడనంతో ఏపీ, ఒడిశాలో వర్షాలకు అవకాశం

02

ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది దేశాన్ని వర్షాభావం వెంటాడింది. నైరుతి రుతుపవనాల సీజన్‌లో దేశవ్యాప్తంగా 15 శాతం లోటు వర్షపాతం నమోదవగా, దక్షిణ ద్వీపకల్పంలో ఏకంగా 28 శాతం తక్కువ వర్షాలు కురిశాయి. 17 ఏండ్లలో ఎన్నడూ లేనంతగా కరువు పరిస్థితులు నెలకొనడంతో పంటల దిగుబడులు దెబ్బతిని రైతులు, సాగు-తాగునీటి సమస్యలను ఎదుర్కొన్నారు. ఈ పరిస్థితుల్లోనే శనివారం పశ్చిమ రాజస్థాన్ నుంచి నైరుతి రుతుపవనాల తిరోగమనం ప్రారంభమైంది.

### విద్యలో రాజకీయాలకు

# చోటు లేదు




**'నో పాలిటిక్స్ ఇన్ స్కూల్స్' విధానం అమలు చేస్తున్నామని మంత్రి నారా లోకేశ్ వెల్లడి**

- తరగతి గది నుంచే సమాజంలో మార్పు మొదలవుతుందన్న లోకేశ్
- చదువుతో పాటు నైతిక విలువలు, దేశభక్తి నేర్పాలని సూచన
- పాఠశాలల్లో రాజకీయ రంగులు లేకుండా చర్యలు
- ప్రైవేటు నుంచి ప్రభుత్వ పాఠశాలలకు 1.10 లక్షల మంది
- ఇంటర్‌లోనూ 10 వేల అడ్మిషన్లు పెరిగాయని వెల్లడి
- ఏఐ, రోబోటిక్స్‌తో పాటు భారతీయ విలువలు నేర్చుకోవాలని సూచన
- విజయానికి కష్టపడటమే మార్గమని విద్యార్థులకు హితవు
- మార్కులు తగ్గినా, సమస్యలు వచ్చినా ధైర్యంగా ఎదుర్కోవాలని సూచన

కాకినాడ,

సమాజంలో మార్పు తరగతి గది నుంచే ప్రారంభమవుతుందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు నైతిక విలువలు, దేశభక్తి, పెద్దలు, మహిళలను గౌరవించే సంస్కారాన్ని చిన్ననాటి నుంచే నేర్పాల్సిన అవసరం ఉందన్నారు.

-మిగతా 2 లో



02

### పాక్ సైన్యంలో

## భారీ మార్పులు

- ఐఎస్ఐలో కీలక అధికారుల బదిలీలు, నియామకాలు
- డీజీఎస్‌గా షమ్షైజ్ ఖాన్‌కు బాధ్యతలు
- భారత్‌కు సంబంధించిన కార్యకలాపాలను పర్యవేక్షించే విభాగం
- మిలిటరీ ఇంటెలిజెన్స్ చీఫ్‌గా అదిల్ వారియాచ్
- వాజిద్ అజీజ్‌ను పదవి నుంచి తొలగించినట్లు సమాచారం
- ఖుర్రం షబ్బీర్‌కు 17 డివిజన్ బాధ్యతలు
- డీజీ-జెడ్‌గా సాజిద్ అమిన్ అవాన్ నియామకం
- షమ్షైజ్ ఖాన్‌కు భారత్ సరిహద్దు కార్యకలాపాల్లో అనుభవం



## జగన్ సమాధానం చెప్పాలి

- రూ.3,200 కోట్ల మద్యం కుంభకోణంపై ఆయన నోరువిప్పాలి
- డిజిటల్ చెల్లింపులు ఎందుకు నిలిపివేశారు?
- మద్యం ఆర్డర్లలో మాన్యువల్ విధానం ఎందుకు?
- గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి

, ఏపీ బ్యూరో

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన మద్యం విధానంలో భారీ అక్రమాలు జరిగాయని, సుమారు రూ.3,200 కోట్ల ముడుపులు వసూలైనట్లు ఆరోపణలు ఉన్నాయని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆరోపించారు. దీనిపై మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్యం విధానానికి సంబంధించి రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఓఎస్డీ సత్యప్రసాద్ కోర్టులో ఇచ్చిన వాంగ్మూలంలో


-మిగతా 2 లో

PRGI NO:APTEL/26/A5450
తెలుగు దిన పత్రిక

# సౌదీకి సాయం చేస్తే ఖబడ్దార్..

**- పాకిస్థాన్, టర్కీలకు హౌతీల వార్నింగ్**
**-సౌదీకి సైనిక సాయం చేస్తే ఉక్కుపిడికిలితో బదులిస్తామని హెచ్చరిక**
**-పాకిస్థాన్, టర్కీ తటస్థంగా ఉండాలని హౌతీల సూచన**
**-యుద్ధంలో జోక్యం చేసుకుంటే రెండు దేశాలపైనా దాడులంటూ వార్నింగ్**
**-సౌదీ, పాక్, టర్కీ మధ్య రక్షణ ఒప్పందంపై హౌతీల ఆగ్రహం**
**-మూడు దేశాల్లో ఏ ఒక్కరిపై దాడైనా అందరిపై దాడిగానే ఒప్పందం**
**-సౌదీ భూభాగ రక్షణకు సిద్ధమని పాక్ ప్రకటన**
**-సౌదీకి సైనిక, సాంకేతిక సాయం అందించేందుకు టర్కీ సంసిద్ధత**
**-సౌదీ ఇంధన వనరులు, నగరాలపై హౌతీల క్షిపణి, డ్రోన్ దాడులు**

న్యూఢిల్లీ



యెమెన్ కు చెందిన హౌతీ రెబల్స్.. పాకిస్థాన్ , టర్కీ దేశాలకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. సౌదీ అరేబియా కు మద్దతుగా సైనిక బలగాలను పంపినా లేదా ప్రత్యక్షంగా జోక్యం చేసుకున్నా 'ఉక్కు పిడికిలి' తో బదులిస్తామని స్పష్టంచేశారు. సౌదీ అరేబియా, పాకిస్థాన్, టర్కీ మధ్య ఇటీవల కుదిరిన త్రైపాక్షిక రక్షణ ఒప్పందం నేపథ్యంలో ఈ హెచ్చరికలు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను మరింత పెంచాయి.హౌతీ అన్సార్ అల్లా పొలిటికల్ బ్యూరో సభ్యుడు మహ్మద్ అల్-బుఖైతీ ఇటీవలి ఇంటర్వ్యూలో ఈ హెచ్చరికలు చేశారు. 'దేవుడి సాక్షిగా చెబుతున్నా. ఒకవేళ పాకిస్థాన్, టర్కీ ఈ యుద్ధంలో జోక్యం చేసుకుంటే, మేము వారిపై ఉక్కు పిడికిలితో విరుచుకుపడతాం' అన్నారు. సౌదీ అరేబియాకు బుద్ధి చెబుతున్నట్లే, ఆ రెండు దేశాలకు కూడా క్రమశిక్షణ నేర్పుతామని వ్యాఖ్యానించారు. తాము సౌదీ నేతృత్వంలోని సైనిక చర్యలు, ఆర్థిక దిగ్బంధనానికి వ్యతిరేకంగా ఆత్మరక్షణ పోరాటమే చేస్తున్నామని బుఖైతీ పునరుద్ఘాటించారు. పాకిస్థాన్, టర్కీ ప్రభుత్వాలు ఈ వివాదంలో తటస్థంగా ఉండాలని, తమ సరిహద్దులకు సంబంధంలేని యుద్ధంలో తలదూర్చవద్దని ఆయన సూచించారు. ఆగస్టు 7న సౌదీ అరేబియా, పాకిస్థాన్, టర్కీలు 'మక్కా జాయింట్ డిఫెన్స్ అగ్రిమెంట్' పై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం.. మూడు దేశాల్లో ఏ ఒక్కరిపైన దాడి జరిగినా దానిని ముగ్గురిపై జరిగిన దాడిగా పరిగణిస్తారు. ఈ ఒప్పందం కింద సౌదీ భూభాగాన్ని రక్షించడానికి సిద్ధంగా ఉన్నామని పాకిస్థాన్ అధికారులు ఇప్పటికే ప్రకటించారు. టర్కీ కూడా సౌదీకి అవసరమైన సైనిక, సాంకేతిక సాయం అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలిచ్చింది. సౌదీలోని ఇంధన వనరులు, ప్రధాన నగరాల సమీప ప్రాంతాలపై హౌతీలు డ్రోన్లు, క్షిపణులతో దాడులు తీవ్రతరం చేసిన తరుణంలో ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అయితే ఈ కొత్త రక్షణ ఒప్పందం కింద విదేశీ బలగాలను యెమెన్‌లో మోహరించినట్లు ఇంకా అధికారికంగా ధ్రువీకరణ కాలేదు.

## ఇరాన్ యుద్ధానికి అమెరికా ఖర్చు రూ.4.32 లక్షల కోట్లు


**o ఏడు నెలల్లో 45.1 బిలియన్ డాలర్లు ఖర్చు చేసినట్లు ని కాంగ్రెస్‌కు ట్రంప్ ప్రభుత్వం వెల్లడి**
**o యుద్ధం కోసం 43.6 బిలియన్ డాలర్ల వ్యయం**
**o చమురు కోసం మరో 1.5 బిలియన్ డాలర్లు ఖర్చు**
**o ఫిబ్రవరి 28 నుంచి సెప్టెంబర్ 2 వరకు లెక్కలు**
**o ఇప్పటి ఖర్చు అంచనా మాత్రమేనని ప్రభుత్వం స్పష్టీకరణ**
**o ధ్వంసమైన స్థావరాలు, భవనాల మరమ్మతు ఖర్చులు ఇందులో లేవు**
**o క్షిపణుల అడ్డుగోలు వ్యవస్థలకే భారీగా వ్యయం**
**o చమురు సరఫరా సమస్యలతోనూ ఆర్థిక భారం**
**o యుద్ధం కొనసాగితే ఖర్చు మరింత పెరిగే అవకాశం**



న్యూఢిల్లీ
అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో చెప్పలేని పరిస్తితి. ఈ యుద్ధం అమెరికాకు ఆర్థిక భారంగా మిగిలింది. ఈ యుద్ధం కోసం ట్రంప్ ప్రభుత్వం చేసిన వ్యయం 45.1 బిలియన్ డాలర్లుగా తేలింది. అంటే మన కరెన్సీలో రూ.4.32 లక్షల కోట్లు అని ట్రంప్ ప్రభుత్వం యూఎస్ కాంగ్రెస్‌కు తెలిపింది. దాదాపు ఏడు నెలల నుంచి సాగుతున్న ఈ యుద్ధం కోసం అమెరికా చేసిన ఖర్చు మన దేశంలోని అనేక రాష్ట్రాల వార్షిక బడ్జెట్‌తో సమానం.ఇందులో 43.6 బిలియన్ డాలర్లు యుద్ధం కోసం ఖర్చుకాగా, 1.5 బిలియన్ డాలర్లు చమురు కోసం అయిన ఖర్చు. అయితే, ఇది అంచనా మాత్రమే. కచ్చితమైన, పూర్తిస్తాయి వివరాలు కాదు. గత ఫిబ్రవరి 28 నుంచి ఈ ఏడాది సెప్టెంబర్ 2 వరకు జరిగిన ఖర్చు మాత్రమే. ఈ వ్యయంలో మిలిటరీ స్థావరాల ధ్వంసం, అనేక బిల్డింగులు ధ్వంసం కావడం, వాటి మరమ్మతులకు సంబంధించిన ఖర్చుల్ని చేర్చలేదు. పూర్తిస్థాయి వ్యయ వివరాల్ని కూడా ప్రభుత్వం వెల్లడించలేదు. ప్రస్తుతం అంచనా వేసిన ఖర్చు.. గతంలో అంచనాలకు మించింది. ప్రస్తుతం ఈ యుద్ధం కొనసాగుతున్నందున ఖర్చు భవిష్యత్తులో ఇంకా పెరిగే అవకాశం ఉంది. అమెరికా చేసిన వ్యయంలో మిస్సైల్స్, క్షిపణుల్ని అడ్డుకునే టెక్నాలజీ కోసమే ఎక్కువ ఖర్చు అయింది. ఇదే సమయంలో యుద్ధం కారణంగా చమురు సరఫరాలో ఇబ్బందులు ఎదురవ్వడం వల్ల కూడా ఆర్థిక భారం పెరిగింది. ఈ ఖర్చులకు ద్వైపాక్షిక సంబంధాలపై జరిగిన చర్చలు వంటివి అదనం.

## రష్యాపై విరుచుకుపడిన ఉక్రెయిన్

మాస్కో



రష్యాపై ఉక్రెయిన్ మరోసారి విధ్వంసక దాడులకు దిగింది. శనివారం అర్ధరాత్రి మాస్కోలోని ప్రాంతాలు లక్ష్యంగా 1,600కుపైగా డ్రోన్లను ప్రయోగించింది. వీటిలో సుమారు 450 డ్రోన్లు మాస్కో నగరం వైపు వచ్చినట్లు మేయర్ సెర్గీ సోబ్యానిన్ తెలిపారు. ఈ దాడిని మాస్కోపై ఇప్పటివరకు జరిగిన అత్యంత భారీ డ్రోన్ దాడిగా ఆయన అభివర్ణించారు. దాడుల్లో మాస్కో ఆయిల్ రిఫైనరీతో పాటు పలు పారిశ్రామిక, లాజిస్టిక్స్ కేంద్రాలు, నివాస భవనాలు దెబ్బతిన్నాయి. రిఫైనరీ పరిసరాల్లో భారీగా మంటలు చెలరేగి, ఆకాశంలోకి దట్టమైన నల్లటి పొగ వ్యాపించింది. రష్యా అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ దాడుల్లో కనీసం ఇద్దరు మరణించగా, పలువురు గాయపడ్డారు. పలు డ్రోన్లు మాస్కోలోని కీలక ఆయిల్ రిఫైనరీతో సహా నాలుగు భవనాలను తాకినట్లు అధికారులు పేర్కొన్నారు. మరోవైపు క్రిమియాపైనా ఉక్రెయిన్ పెద్ద ఎత్తున దాడులు కొనసాగిస్తోంది. సైనిక సరఫరాలు, విద్యుత్ వ్యవస్థలు లక్ష్యంగా తాజాగా దాడులు జరిగింది. వీటి కారణంగా మాస్కోలోని విమానాశ్రయాలు తాత్కాలికంగా మూతబడ్డాయి.
ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోడిమిర్ జెలెన్‌స్కీ కూడా తాజాగా దాడులను ధృవీకరించారు. యుద్ధానికి ఆర్థికంగా సహకరిస్తున్న కీలక మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకున్నట్లు పేర్కొన్నారు. దాడి అనంతరం పారిశ్రామిక ప్రాంతాల్లో భారీగా చెలరేగిన మంటల దృశ్యాలను జెలెన్‌స్కీ విడుదల చేశారు. రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ మాత్రం రష్యా భూభాగం, ఆక్రమిత క్రిమియా, నల్లసముద్ర ప్రాంతాల్లో 1,110 ఉక్రెయిన్ డ్రోన్లను అడ్డుకున్నట్లు ప్రకటించింది.
మాస్కో ప్రాంతంలోని సోఫినోలో డ్రోన్ దాడిలో మూడు అంతస్తుల నివాస భవనం దెబ్బతినడంతో 44 ఏళ్ల మహిళ మృతి చెందగా, మరో ఐదుగురు గాయపడ్డారు. మరోచోట ఓ ఇల్లు దెబ్బతినడంతో వృద్ధుడు మరణించినట్లు ప్రాంతీయ గవర్నర్ ఆండ్రే వోరోబ్యోవ్ తెలిపారు.
పార్లమెంట్ ఎన్నికల వేళ దాడులు
ఈ భారీ దాడులు రష్యాలో స్టేట్ డూమా పార్లమెంట్ ఎన్నికల చివరి రోజు చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికలను అడ్డుకునేందుకే ఈ దాడి జరిగిందని మాస్కో మేయర్ ఆరోపించారు. రష్యా ఎన్నికల్లో అధికార యునైటెడ్ రష్యా పార్టీ ఆధిపత్యం కొనసాగుతుందని అంచనా. ప్రతిపక్షాలపై ఆంక్షలు, యుద్ధ వ్యతిరేక అభ్యర్థులకు అవకాశం లేకపోవడంపై విమర్శలు ఉన్నాయి. ఉక్రెయిన్ మాత్రం రష్యా ఎన్నికలను "షామ్ ఎలక్షన్" గా అభివర్ణించింది. ఇదిలా ఉండగా, ఉక్రెయిన్ అధికారులు కీవ్, సుమీ ప్రాంతాల్లో రష్యా జరిపిన దాడుల్లో ముగ్గురు చిన్నారులు సహా తొమ్మిది మంది మరణించినట్లు తెలిపారు. దీంతో ఇరు దేశాల మధ్య డ్రోన్, క్షిపణి దాడులు మరింత తీవ్రతరమైన పరిస్థితి కనిపిస్తోంది.

# ఎల్ నినోను ముందే అంచనా వేసుకున్నాం

అమరావతి,
రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, చేపట్టాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు, ఆర్డీఓలకే సిబ్బందితో టెలికాన్ఫరెన్స్ ద్వారా పరిస్థితిని సమీక్షించారు. ఎల్ నినో వంటి విపత్కర పరిస్థితుల్లో రైతులను ఆదుకోవడంతో పాటు మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు పెరగకుండా నియంత్రించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఎల్ నినో ప్రభావాన్ని సవాలుగా తీసుకుని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.
రైతులు, వినియోగదారులకూ భరోసా
ఎల్ నినో పరిస్థితులను ముందుగానే అంచనా వేసి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని చంద్రబాబు తెలిపారు. దాని ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని సూచించారు. దీని ప్రభావం వ్యవసాయ రంగానికే పరిమితం కాకుండా ఇతర వ్యవస్థలపైనా ఉంటుందని, రైతులను కాపాడుతూనే వినియోగదారులపై ధరల భారం పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. బియ్యం, ఉల్లి, పామాయిల్, కందిపప్పు తదితర నిత్యావసరాల ధరలను నియంత్రించాలని ఆదేశించారు. గోదాముల్లోని బియ్యం నిల్వలను అవసరానికి అనుగుణంగా మార్కెట్‌లోకి విడుదల చేయాలని సూచించారు. ఉల్లి కొరత లేకుండా ఇతర ప్రాంతాల నుంచి కొనుగోళ్లు చేపట్టడంతో పాటు భవిష్యత్ డిమాండ్‌కు అనుగుణంగా సాగును ప్రోత్సహించాలని చెప్పారు.



50.7 శాతం లోటు వర్షపాతం
రాష్ట్రంలో ఇప్పటివరకు 50.7 శాతం లోటు వర్షపాతం నమోదైందని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రకాశం, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాల్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు 30.84 లక్షల హెక్టార్లలో సాగు చేపట్టాల్సి ఉండగా ఇప్పటివరకు 79 శాతం విస్తీర్ణంలోనే సాగు పనులు ప్రారంభమయ్యాయని వివరించారు. రైతులకు పంటల బీమా ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. వర్షాధార పంటలు, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని తెలిపారు.
రూ. 250 కోట్లతో ముందస్తు చర్యలు
హైరిస్క్ జోన్‌లోని ఉద్యాన పంటలను రక్షించేందుకు రూ. 190 కోట్లు కేటాయించినట్లు చంద్రబాబు తెలిపారు. ఖరీఫ్ కంటింజెన్సీ ప్రణాళిక కోసం మరో రూ. 60 కోట్లు సిద్ధంగా ఉంచామని చెప్పారు.
1.31 లక్షల క్వింటాళ్ల విత్తనాలను 80 శాతం సబ్సిడీతో రైతులకు అందించినట్లు వివరించారు. స్వయం సహాయక బృందాల ద్వారా కిచెన్ గార్డెన్లను ప్రోత్సహించడం వల్ల కూరగాయల లభ్యత పెరిగి ధరలను నియంత్రించవచ్చని పేర్కొన్నారు. పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.
సాగునీటిపై గత ప్రభుత్వంపై విమర్శలు
2014-19 మధ్య తమ ప్రభుత్వం సాగునీటి రంగంపై రూ. 65 వేల కోట్లు ఖర్చు చేయగా, 2019-24 మధ్య నాటి ప్రభుత్వం రూ. 22 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని చంద్రబాబు పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తయి ఉంటే ఎల్ నినో వంటి పరిస్థితులను ఎదుర్కోవడం సులభమయ్యేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 3,500 కోట్లతో 100 రోజుల్లో హంద్రీ-నీవా కాలువలకు నీరు అందించగలిగామని తెలిపారు.
క్షేత్రస్థాయిలో పర్యటనలు
అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సమస్యలను నేరుగా తెలుసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. స్థానిక ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్నా ప్రజాప్రతినిధులు గ్రామాల్లో పర్యటించి రైతులకు భరోసా కల్పించాలని అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం, రైతులు, సాగునీటి సంఘాలు సమన్వయంతో పనిచేసి ఎల్ నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కోవాలని దిశానిర్దేశం చేశారు.

## 17 ఏండ్లలో లేనంతగా కరువు

ఎల్ నినోతో 15 శాతం లోటు వర్షపాతం నమోదు
తెలంగాణలో 22%, ఏపీలో 45% తక్కువగా రికార్డు
నైరుతి తిరోగమనం ప్రారంభం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20



నైరుతి రుతుపవనాల తిరోగమనంప్రారంభమైంది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో దేశంలో 15 శాతం తక్కువ వర్షపాతంనమోదు కాగా, ఎల్ నినో కూడా ఏర్పడటంతో తీవ్ర వర్షాభావ, కరవు పరిస్థితులు ఏర్పడ్డాయి. ముఖ్యంగా దక్షిణ ద్వీపకల్పం తీవ్రంగా ప్రభావితమై 28 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. గత 17 ఏండ్లలో ఎన్నడూ లేనంతగా అత్యంత కరువు పరిస్థితులు నెలకొన్నాయి. వేలాది ఎకరాల్లో పంటలు పండక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో దేశంలోని పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది.
సాగునీటికే కాక, తాగు నీటికి కూడా ఇబ్బందులు ఏర్పడ్డాయి. 17 ఏండ్లలో అత్యంత తీవ్రమైన కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్న తరుణంలోనే శనివారం నైరుతి రుతుపవనాలు పశ్చిమ రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల నుంచి తిరోగమించడం ప్రారంభమైంది. రాబోయే కొద్ది వారాల్లో నాలుగు నెలల పాటు సాగే వర్షాకాలం ముగింపునకు నాంది పలకబోతున్నది. రాజస్థాన్‌లోని మరికొన్ని ప్రాంతాలు, పంజాబ్, గుజరాత్‌లలోని కొన్ని ప్రాంతాల నుంచి తిరోగమనానికి రానున్న 3,4 రోజులు అనుకూలంగా ఉన్నాయని భారత వాతావరణ శాఖ తెలిపింది.
దక్షిణ రాష్ట్రాలపై తీవ్ర ప్రభావం
బలమైన ఎల్ నినో ప్రభావం కారణంగా ఈ సీజన్ మొత్తంలో దేశవ్యాప్తంగా 15 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఇక దక్షిణాది రాష్ట్రాలను చూస్తే అత్యధికంగా ఏపీలో 43 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. తర్వాతి స్థానాల్లో కర్ణాటక (31 శాతం), కేరళ (28 శాతం), తమిళనాడు (22 శాతం), తెలంగాణ (22 శాతం) ఉన్నాయి. ఇక ఇతర రాష్ట్రాల్లో పంజాబ్‌లో అత్యధికంగా 39 శాతం లోటు వర్షపాతం నమోదైంది. బీహార్ (36 శాతం), హర్యానా (22 శాతం),

## పాక్ సైన్యంలో భారీ మార్పులు

న్యూఢిల్లీ



పాకిస్తాన్ సైన్యంతోపాటు ఐఎస్ఐలో కీలక మార్పులు జరిగాయి. అనేక విభాగాలకు చెందిన ఉన్నతాధికారుల్ని మార్చేశారు. డీజీ-ఎస్ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ ద స్పెషల్ ఆపరేషన్స్ డైరెక్టరేట్)గా మేజర్ జనరల్ ముహమ్మద్ షమైజ్ ఖాన్‌ను ఆర్మీ నియమించింది. ఇది ఐఎస్ఐలో కీలక విభాగం. ప్రధానంగా ఇండియాకు వ్యతిరేకంగా పాక్ సైనిక కార్యకలాపాల్ని, ఉగ్ర కార్యకలాపల్ని కూడా పర్యవేక్షిస్తుంటుంది.రెండు రోజుల క్రితం.. అంటే గత శుక్రవారమే సైన్యంలో ఇలా అనేక మార్పులు జరిగినట్లు భారత నిఘా విభాగం గుర్తించింది. మరోవైపు మిలిటరీ ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఉన్న మేజర్ జనరల్ వాజిద్ అజీజ్‌ను తొలగించినట్లు తెలుస్తోంది. అతడి స్థానంలో మేజర్ జనరల్ అదిల్ వారియాచ్‌ను నియమించారు. అలాగే, ఐఎస్ఐ కౌంటర్ టెర్రరిజం డైరెక్టరేట్‌గా ఉన్న మేజర్ జనరల్ ఖుర్రం షబ్బీర్‌ను కూడా తొలగించారు. అతడిని జీఓసీ 17 డివిజన్, ఖైరాన్‌కు బదిలీ చేశారు. మేజర్ జనరల్ సాజిద్ అమిన్ అవాన్‌ను డీజీ-జడ్‌కు అధిపతిగా నియమించారు. ఇటీవల పాక్ ఆర్మీలో అంతర్గత బదిలీలు జరిగిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా ఉన్నత విభాగాల అధికారులను మరో స్థానంలోకి మారుస్తున్నారు. అన్నింటిలోకి కీలకమైంది ఐఎస్ఐ డీజీఎస్‌గా మేజర్ జనరల్ ముహమ్మద్ షమైజ్ ఖాన్‌ను నియమించడం. ఐఎస్ఐ అంటే, పాక్ ఇంటెలిజెన్స్ విభాగం. అయితే, ప్రస్తుతం నియామకమైన ముహమ్మద్ షమైజ్ ఖాన్‌కు ఎలాంటి ఇంటెలిజెన్స్ అనుభవం లేదు. అయితే, ఇండియా సరిహద్దులో కార్యకలాపాల నిర్వహణలో మాత్రం అతడికి అనుభవం ఉంది.

## విద్యలో రాజకీయాలకు చోటు లేదు

మొదటి తరువాయి

సాంకేతికతకు భారతీయ విలువలు జోడిస్తే విద్యార్థులు ప్రపంచ విజేతలుగా ఎదగగలరని పేర్కొన్నారు. కాకినాడ రూరల్ తిమ్మాపురంలోని ఆకుండి లక్ష్మి స్మారక గోశాలలో నిర్వహించిన 'భారతీయం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.
విద్యార్థులకు విలువల విద్యపై దిశానిర్దేశం
కార్యక్రమం విద్యార్థులు ఆలపించిన వందేమాతరం గేయంతో ప్రారంభమైంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్, లాల్ బహదూర్ శాస్త్రి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్, మోక్షగుండం విశ్వేశ్వరయ్య తదితరుల పాత్రలను ప్రదర్శించారు. వారి దేశభక్తి, త్యాగాల సందేశాలను ప్రతిబింబించే ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రముఖ ప్రవచనకర్త, ఏపీ ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావు విద్యార్థులకు నైతిక విలువలు, దేశభక్తిపై సందేశం ఇచ్చారు. అనంతరం మంత్రి లోకేష్ విద్యార్థులతో ముచ్చటించి తన అనుభవాలను పంచుకున్నారు. దేశం కోసం ఆలోచించడం, త్యాగధనుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవడం, ఓర్పు, సహనంతో ముందుకు సాగడంపై సూచనలు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన సంస్కరణలను మంత్రి వివరించారు. ఈ ఏడాది ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోకి 1.10 లక్షల మంది విద్యార్థులు చేరారని తెలిపారు. ఇంటర్మీడియట్‌లోనూ 10 వేల అడ్మిషన్లు పెరిగాయని చెప్పారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతోనే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. నైతిక విలువలను కూడా విద్యలో భాగం చేసే 'ఏపీ మోడల్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్' దేశంలో ప్రత్యేకంగా నిలుస్తుందని అన్నారు. విద్యాశాఖలో రాజకీయాలకు తావులేకుండా 'నో పాలిటిక్స్ ఇన్ స్కూల్స్' విధానాన్ని అమలు చేస్తున్నామని లోకేష్ తెలిపారు. విద్యార్థుల యూనిఫాం, పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు, షూస్‌లో రాజకీయ పార్టీలకు సంబంధించిన రంగులు లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం విద్యార్థి కేంద్రంగా ఉండాలన్నారు. ఏఐ, రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు భారతీయ విలువలు, నైతికతను విద్యార్థులు అలవర్చుకోవాలని సూచించారు. చిన్న సమస్యలకు కుంగిపోకుండా ధైర్యంగా ఎదుర్కోవాలని అన్నారు. మార్కులు తక్కువ వచ్చినా, అనుకున్నది సాధించలేకపోయినా తీవ్ర నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. ఇంట్లో చెప్పుకోలేని సమస్యలు ఎదురైతే ఉపాధ్యాయులతో పంచుకోవాలని చెప్పారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల త్యాగాలను గుర్తించి వారు గర్వపడేలా ఎదగాలని పిలుపునిచ్చారు.


## ఏపీ, తెలంగాణ మధ్య ప్రత్యేక రైళ్లు

మొదటి తరువాయి

గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, సింహాచలం, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి స్టేషన్లలో ఆగుతాయి. వీటితో పాటు చర్లపల్లి - నాగర్కోయిల్ మార్గంలోనూ 10 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైలు నంబర్ 07535 సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 23 వరకు ప్రతి శుక్రవారం, రైలు నంబర్ 07536 సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 25 వరకు ప్రతి ఆదివారం నడవనున్నాయి. పండుగ సీజన్లో సొంతూర్లకు వెళ్లే ప్రయాణికులు ఈ ప్రత్యేక సర్వీసులను వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

## విదేశాంగ శాఖ మంత్రికి 'సర్' నోటీసు..!

న్యూఢిల్లీ



కేంద్ర ఎన్నికల సంఘం తీసుకొచ్చిన ప్రత్యేక సమగ్ర సవరణ లో భాగంగా.. సామాన్యుల నుంచి రాజకీయ ప్రముఖులు, కేంద్ర మంత్రులు కూడా నోటీసులు ఎదుర్కొంటున్నారు. తాజాగా విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జై శంకర్ కూడా నోటీసులు అందుకున్నారు. ఢిల్లీలో సర్ ప్రక్రియలో భాగంగా ఆదివారం జై శంకర్ ఆయన సతీమణి క్యోకో జై శంకర్‌కు ఈ లేఖలు అందాయి. వీరితో పాటు సీబీఐ డైరెక్టర్, మాజీ ఆర్మీ అధికారులు సర్ నోటీసులు అందుకున్నారు.ఓటరు జాబితాలో సవరణలో భాగంగా దేశవ్యాప్తంగా పలువురు సర్ నోటీసులు అందుకుంటున్నారు. ఢిల్లీలో ఆదివారం కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్‌కు కూడా నోటీసు వచ్చాయి. 2002 ఢిల్లీ ఓటరు జాబితాలో జై శంకర్, ఆయన భార్య పేరు లేవు. దాంతో, ఓటరు జాబితాలో అవసరమైన మార్పుల కోసం సరైన ధ్రువ పత్రాలు సమర్పించాలని వీరికి ఎన్నికల సంఘం నోటీసులు ఇచ్చింది. ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, ఆయన కుటుంబ సభ్యులకు బీఎల్‌వోలు సర్ నోటీసు ఇచ్చారు.తాజాగా సర్ నోటీసు అందుకున్న వారిలో ఆర్మీ మాజీ అధికారి ఉపేంద్ర ద్వివేది, ఆయన భార్య.. సుప్రీం కోర్టు మాజీ న్యాయవాది రంజన దేశాయ్, ఆయన కుటుంబ సభ్యులు ఉన్నారు. 'విదేశాంగ మంత్రి సహా పలువురు అధికారులు, మాజీ న్యాయవాది, వారి కుటుంబ సభ్యుకు సిస్టమ్ ఆధారిత నోటీసులు అందించాం. ఈసీఐఎన్ఈటీలో వీరు తమ వివరాలను సరి చేసుకోవాలని కోరాం' అని ఢిల్లీ ఎన్నికల అధికారి వెల్లడించారు

## ఇటలీ పాఠశాలల్లో బుర్ఖా, నిఖాబ్‌పై నిషేధం

విదేశీ విద్యార్థుల సంఖ్యపై పరిమితి

రోమ్:
ఇటలీలోని పాఠశాలల్లో ముఖాన్ని పూర్తిగా కప్పి ఉంచే బుర్ఖా, నిఖాబ్‌లను నిషేధించడంతోపాటు, ఒక్కో తరగతిలో విదేశీ విద్యార్థుల సంఖ్యపై పరిమితి విధించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నది. ఈ విషయాన్ని ఆ దేశ ప్రధాని జార్జియా మెలోని ఆదివారం ప్రకటించారు. విద్యా వ్యవస్థలో ఇటాలియన్ భాషా పరిజ్ఞానం, వలస విధానాలకు సంబంధించిన చర్యలను క్యాబినెట్ ముందుకు తీసుకురానున్నట్లు ఆమె తెలిపారు. మెలోని తన 'బ్రదర్స్ ఆఫ్ ఇటలీ' పార్టీ యువజన విభాగం వార్షిక సమావేశంలో ఈ ప్రతిపాదన వెల్లడించారు. ప్రతి తరగతి గదిలో విదేశీ విద్యార్థుల సంఖ్య గరిష్ఠ పరిమితిని చట్టబద్ధం చేసే చర్యను త్వరలోనే క్యాబినెట్ ముందుకు తీసుకువస్తామని తెలిపారు.

## జగన్ సమాధానం చెప్పాలి

మొదటి తరువాయి

కీలక అంశాలు వెల్లడైనట్లు వార్తా కథనాలు పేర్కొంటున్నాయని మంత్రి తెలిపారు. తాడేపల్లిలోని అప్పటి ముఖ్యమంత్రి నివాసంలో మద్యం విధానానికి సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు ఆయన వెల్లడించారని అన్నారు. మద్యం విధానంలో నిర్ణయాలు ఎలా తీసుకున్నారు? వాటి వెనుక ఎవరున్నారు? అనే అంశాలపై స్పష్టత అవసరమన్నారు. మద్యం విక్రయాల్లో డిజిటల్ చెల్లింపులను ఎందుకు పక్కన పెట్టి నగదు లావాదేవీలకు ప్రాధాన్యం ఇచ్చారో అప్పటి ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. మద్యం ఆర్డర్ల కేటాయింపులో గత విధానాన్ని మార్చి మాన్యువల్ విధానం అమలు చేసినట్లు సత్యప్రసాద్ వాంగ్మూలంలో పేర్కొన్నట్లు వార్తలు వచ్చాయని తెలిపారు. ఈ మార్పులు ఎవరి ఆదేశాలతో జరిగాయి? దాని వల్ల ఎవరికి ప్రయోజనం కలిగింది? అనే అంశాలపై దర్యాప్తు జరగాలని అన్నారు. కొత్త బ్రాండ్ల ప్రవేశం, ఆర్డర్ల కేటాయింపు, సరఫరా విధానంలో మార్పులపైనా దర్యాప్తు జరగాల్సి ఉందన్నారు. అంతేగాక, రవాణా రేట్ల పెంపు, కాంట్రాక్టుల కేటాయింపు, సిబ్బంది నియామకాలు, జీతాల చెల్లింపుల్లో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఈ అంశాలపై దర్యాప్తులో వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉందన్నారు.
నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యం
ప్రస్తుత కూటమి ప్రభుత్వం మద్యం విక్రయాల్లో నాణ్యత, పారదర్శకత, పర్యవేక్షణకు ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. గౌడ సామాజిక వర్గానికి 10 శాతం దుకాణాలను కేటాయించే విధానాన్ని అమలు చేశామని చెప్పారు. మద్యం నాణ్యత నిర్ధారణకు 13 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నామని, కల్తీని అరికట్టేందుకు 'ఏపీ ఎక్సైజ్ సురక్ష' యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. నూతన ఎక్సైజ్ విధానంలో డిజిటల్ పర్యవేక్షణ, మద్యం దుకాణాల్లో సీసీ కెమెరాలు, నిబంధనల ఉల్లంఘనలకు జరిమానాలు వంటి చర్యలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

# గణపతి నవరాత్రి అన్నదానంలో పాల్గొన్న పంతం సందీప్





**రాజేశ్వరి నగర్, మహాలక్ష్మి నగర్‌లో భక్తులతో కలిసి అన్నప్రసాదం స్వీకరణ**

**కాకినాడ, సెప్టెంబర్ 20 (నేటి దర్శిని)**
కాకినాడ గ్రామీణ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా పలు ప్రాంతాల్లో గణపతి ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసంతర్పణ కార్యక్రమాల్లో కాకినాడ గ్రామీణ ఎమ్మెల్యే పంతం నానాజీ తనయుడు పంతం సందీప్ పాల్గొన్నారు. కాకినాడ 49వ డివిజన్‌లోని రాజేశ్వరి నగర్‌లో గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఉత్సవ కమిటీ సభ్యులు, సుబ్బరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసంతర్పణ కార్యక్రమంలో పంతం సందీప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాకినాడ గ్రామీణ మండలం తూరంగి గ్రామ పంచాయతీ పరిధిలోని మహాలక్ష్మి నగర్‌లో శ్రీ బాల గణపతి యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసంతర్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులతో కలిసి అన్నప్రసాదం స్వీకరించారు.
ఈ కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ సభ్యులు, కూటమి నాయకులు, జనసైనికులు, వీర మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహాలక్ష్మి నగర్ కార్యక్రమంలో పితాని తేజ, జక్కి అప్పన్న, వల్లూరి రాజా, శాండీ, వెలగ జశ్వంత్, అడ్డాల దుర్గ ప్రసాద్, కిరణ్, గోపి, దానయ్య, యశ్వంత్, మద్దు శ్రీనివాస్, కోటి, చంటి, కొటారి వీరబాబు తదితరులు పాల్గొన్నారు. రాజేశ్వరి నగర్ కార్యక్రమంలో మల్లిపూడి ఈశ్వర్, ముమ్మిడి వాసు, అనసూరి రాజకుమారి, పాలిక రమణ, భద్రం, గుంటముక్కల శ్రీనివాస్, వెలిశెట్టి రాజేష్, శ్రీరంగం వాసు, పరవస్తు పవన్, రవి తేజ తదితరులు పాల్గొన్నారు.

# ఆశావహుల నుండి దరఖాస్తుల ఆహ్వానం

**- నేడు గుంతకల్లులో పిఎంఆర్ ఫంక్షన్ హాల్లో ప్రత్యేక సమావేశం**

**గుంతకల్లు, సెప్టెంబర్ 20 (నేటి దర్శిని)**
త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సదరు ఎన్నికల్లో పోటీ చేయదలచుకున్న ఆశావహుల నుండి దరఖాస్తులను స్వీకరించే కార్యక్రమానికి టిడిపి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు గుంతకల్లు నియోజకవర్గం వ్యాప్తంగా మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పిటిసి, సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సంసిద్ధమవుతున్న ఆశావహులతో ఈ నెల 21వ తేదీ సోమవారం గుంతకల్లు పట్టణంలోని ఉరవకొండ రోడ్డులో ఉన్న పీఎంఆర్ ఫంక్షన్ హాలులో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి గుంతకల్లు నియోజకవర్గం అబ్జర్వర్ ఏలేటి ప్రతాపరెడ్డి హాజరు హాజరు కానున్నారు ఆశావహులు ఈ సమావేశానికి హాజరుకావాలని స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి ఆదేశాలు అందాయి.

# నేటి నుంచి మూడు రోజులపాటు సామూహిక దీక్షలు

**గుంతకల్లు, సెప్టెంబర్ 20 (నేటి దర్శిని)**
అనంతపురం జిల్లాను జాతీయ కరువు విపత్తుగా ప్రకటించి జిల్లా రైతాంగాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరుతూ ఈనెల 21, 22,23 తేదీల్లో వైఎస్ఆర్సిపి, సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్, సిపిఐఎంఎల్ పార్టీల ఆధ్వర్యంలో మూడు రోజులపాటు సామూహిక దీక్షలు చేపట్టనున్నాయి. గుంతకల్లు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఈ దీక్షలు చేపట్టనున్నట్లు ఆయా పార్టీల ప్రతినిధులు పేర్కొన్నారు. మొదటిరోజు సోమవారం ఈ దీక్షలో వైఎస్ఆర్సిపి అనుబంధం రైతు విభాగం నేతలు పాల్గొంటున్నట్లు వారు తెలిపారు. ముఖ్యఅతిథిగా స్థానిక తాజా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు.

# వృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక డే కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలి: ఎమ్మెల్యే పంతం నానాజీ

**సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే**




**కాకినాడ, సెప్టెంబర్ 20 (నేటి దర్శిని)**
కాకినాడ జిల్లా కాకినాడ గ్రామీణ నియోజకవర్గం రమణయ్యపేట పంచాయతీ పరిధిలోని ఏపీఐఐసీ కాలనీలో ఉన్న లయన్స్ క్లబ్ మల్టీ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్, కాకినాడ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కాకినాడ గ్రామీణ శాసనసభ్యులు పంతం నానాజీ, కుడా చైర్మన్ తలాటం సత్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాల్లో వృద్ధుల కోసం ప్రత్యేక డే కేర్ సెంటర్ల ఏర్పాటుపై ఎమ్మెల్యే పంతం నానాజీ ప్రస్తావించి, వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇవ్వాలని కోరిన విషయాన్ని సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు గుర్తు చేశారు. వృద్ధుల సమస్యలపై అసెంబ్లీలో గళం వినిపించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పంతం నానాజీని దుశ్శాలువతో సత్కరించారు. అలాగే ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా వృద్ధాప్య పింఛన్‌ను రూ. 4,000కు పెంచి అందిస్తున్నందుకు కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు అసోసియేషన్ ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు. వృద్ధుల సంక్షేమం, వారి సామాజిక భద్రత, ఆరోగ్యం, గౌరవప్రదమైన జీవనం కోసం ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు కే. రామచంద్రరావు, ఉమామహేశ్వరరావు, హరిహరరావు, అడబాల రత్న ప్రసాద్, ముద్దరాజు సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

# దేమాచుపల్లిలో సందడిగా వినాయకుడి లడ్డూ వేలం



**చిట్వేల్, సెప్టెంబర్ 20 (నేటి దర్శిని)**
: చిట్వేల్ మండలం దేమాచుపల్లి గ్రామంలో వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన వినాయకుడి లడ్డూ వేలంపాటలో గ్రామస్థులు, భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. లడ్డూను దక్కించుకునేందుకు పలువురు పోటీపడగా మన్నూరు వెంకటసుబ్బారెడ్డి రూ. 32 వేలకు లడ్డూను సొంతం చేసుకున్నారు. వేలంపాట సందర్భంగా గ్రామంలో సందడి నెలకొంది. అనంతరం వినాయక విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి వీడ్కోలు పలికారు.

# మంత్రి నారా లోకేష్‌కు ఎమ్మెల్యే వనమాడి కొండబాబు స్వాగతం



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 20 (నేటి దర్శిని):**
కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, మానవ వనరుల శాఖ మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్‌ను కాకినాడ నగర నియోజకవర్గ శాసనసభ్యులు వనమాడి కొండబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్‌కు ఎమ్మెల్యే కొండబాబు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కాకినాడ జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి నారా లోకేష్‌తో ఎమ్మెల్యే కొండబాబు కొద్దిసేపు ముచ్చటించారు. జిల్లా అభివృద్ధి, నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భారతీయం దేశభక్తి కార్యక్రమానికి హాజరైన మంత్రి నారా లోకేష్






**కాకినాడ, సెప్టెంబర్ 20, (నేటి దర్శిని):**
కాకినాడ జిల్లా కాకినాడ గ్రామీణ మండలం తిమ్మాపురం గ్రామంలో ఆకుండి లక్ష్మి స్మారక గోశాల ప్రాంగణంలో పాఠశాల విద్యాశాఖ, ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు, ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యాన 'భారతీయం' పేరుతో నిర్వహించిన దేశభక్తి కార్యక్రమానికి హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించిన ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్. ప్రభుత్వ కృషికి నైతిక విలువలు తోడైతే దేశంలోనే నెం.1గా ఏపీ విద్యావ్యవస్థ రూపుదిద్దుకుంటుందని లోకేష్ అభిప్రాయపడ్డారు. తరగతి గది నుంచి సమాజంలో మార్పు సాధ్యమన్నారు. సాంకేతికతకు భారతీయ విలువలు జోడించి ప్రపంచ విజేతలుగా ఎదుగుదామని పిలుపునిచ్చారు. దేశభక్తి, నైతిక విలువలే మన కుటుంబ వ్యవస్థకు పునాది అన్నారు. త్యాగధనులే మన మార్గదర్శకులు, వారి బాటలో పయనిద్దాం అన్నారు. విలువలతో ఎదిగి తల్లిదండ్రులకు, దేశానికి గర్వకారణంగా నిలవాలని మార్గదర్శనం చేశారు. భారతీయం కార్యక్రమంలో విద్యార్థులు త్యాగధనులైన మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, లాల్ బహదూర్ శాస్త్రి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, అబ్దుల్ కలామ్, మోక్షగుండం విశ్వేశ్వరయ్య, దుర్గాబాయి దేశ్‌ముఖ్, ఎం.ఎస్. సుబ్బలక్ష్మి, తరిగొండ వెంగమాంబ, డొక్కా సీతమ్మ, సచిన్ టెండూల్కర్ పాత్రలతో దేశభక్తిపై ఇచ్చిన సందేశాలు ఆకట్టుకున్నాయని మంత్రి లోకేష్ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు పాల్గొన్నారు.

# అనుంపల్లిలో ఘనంగా వినాయక చవితి సంబరాలు

**- రూ.86 వేలకు వినాయకుడి లడ్డూ వేలం**



**చిట్వేల్, సెప్టెంబర్ 20 (నేటి దర్శిని)**
తిరుపతి జిల్లా చిట్వేల్ మండలం అనుంపల్లి గ్రామంలో వినాయక చవితి సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. సకల శుభకార్యాలకు తొలి పూజ అందుకునే వినాయకుడిని భక్తిశ్రద్ధలతో కొలుస్తూ గ్రామంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచే చిన్నారులకు ఆటల పోటీలు, రంగవల్లులు, ఉట్టి కొట్టడం తదితర కార్యక్రమాలతో సందడి నెలకొంది. పసుపులేటి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భారీగా అన్నదానం నిర్వహించగా గ్రామస్తులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం నిర్వహించిన వినాయకుడి లడ్డూ వేలంపాటలో ఎన్నడూ లేని విధంగా రూ. 86 వేలకు పసుపులేటి శ్రీనివాసులు కుమారుడు వెంకటరమణ లడ్డూను దక్కించుకున్నారు. వేలంపాటలో లడ్డూ దక్కించుకున్న వెంకటరమణను గ్రామస్థులు కరతాళధ్వనులతో అభినందిస్తూ మేళతాళాల మధ్య ఆయన ఇంటి వరకు తీసుకెళ్లారు. అనంతరం గ్రామంలో వినాయకుడి ఊరేగింపు నిర్వహించగా ప్రతి ఇంటి వద్ద భక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. అలాగే కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ప్రసాదాన్ని కూడా గ్రామంలోని ప్రతి కుటుంబానికి అందజేశారు. వినాయక చవితి వేడుకలు గ్రామ ఐక్యత, సమైక్యతకు ప్రతీకగా నిలిచాయని గ్రామస్థులు తెలిపారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి ఉత్సవాలు నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందని యువకులు పేర్కొన్నారు. పెద్దలు, మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# నేడు పామూరు పోలీస్ స్టేషన్లో 'గ్రీవెన్స్' కార్యక్రమం

**-జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు**



**పామూరు,మార్కాపురం, సెప్టెంబర్ 20 (నేటి దర్శిని)**
నేడు జిల్లా లోని పామూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో (సోమవారం) ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు నిర్వహించబడుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో స్పష్టంగా రాసి అందజేయాలని సూచించారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు, వినతులను పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# అడవి నేపథ్యంలో వైల్డ్ యాక్షన్‌తో సత్యదేవ్.. 'సమవర్తి' టీజర్ రిలీజ్




వర్సటైల్ ట్యాలెంటెడ్ హీరో సత్యదేవ్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న లేటెస్ట్ ఎకోలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ 'సమవర్తి'. అజయ్ నాగ్ వి. దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ తాజాగా అధికారిక టీజర్‌ను లాంచ్ చేశారు. విభిన్నమైన కథాంశంతో వస్తున్న ఈ టీజర్ ప్రస్తుతం సినీ వర్గాల్లో మరియు ప్రేక్షకులలో తీవ్ర చర్చనీయాంశమైంది.ప్రకృతికి, మానవులకు మధ్య నడిచే సంఘర్షణ, అడవుల అక్రమ నరికివేత, గిరిజనుల జీవన విధానం వంటి సరికొత్త పాయింట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. టీజర్ ఆరంభంలో వచ్చే వైవిధ్యమైన వాయిస్ ఓవర్ కథపై ఆసక్తిని కలిగిస్తుంది. ఇక ఈ చిత్రంలో 'మహాదేవ్' అనే వైల్డ్ అండ్ రగ్డ్ పాత్రలో సత్యదేవ్ కనిపించనున్నారు. ఆయన గెటప్, తెలంగాణ యాసలో చెప్పే పవర్‌ఫుల్ డైలాగులు, ముఖ్యంగా టీజర్ ముగింపులో వచ్చే "ఈసారి మిస్ అవ్వదు" అనే డైలాగ్ సినిమాపై హైప్‌ను తారాస్థాయికి చేర్చాయి. అడవులు, ప్రత్యేకమైన లొకేషన్లలో అత్యంత సహజసిద్ధంగా తెరకెక్కించిన విజువల్స్ ఈ సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. చివరిలో చూపించిన పులి ఎంట్రీ సీన్ మరింత ఉత్కంఠను రేకెత్తిస్తోంది. ఇందులో దిలీష్ పోతన్, రాజీవ్ కనకాల, గానవి లక్ష్మణ్, రవీంద్ర విజయ్, మోహన్ భగత్ వంటి ప్రముఖ తారాగణం నటిస్తోంది. సింజిత్ యర్రమిల్లి సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని రుద్ర పిక్చర్స్ మరియు పంచభూత ప్రొడక్షన్స్ సంస్థలు అత్యున్నత నిర్మాణ విలువలతో భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్-ఇండియా స్థాయిలో ఈ చిత్రం విడుదల కానుంది.

# సమంత స్థానంలో?



సినిమాల్లో కథానాయికల మార్పు సాధారణమే. అయితే ఓ అంతర్జాతీయ ప్రాజెక్ట్‌లో ఓ నాయిక స్థానాన్ని మరొకరు భర్తీ చేయడం మాత్రం చాలా అరుదు. ఇప్పుడు అలాంటి మార్పే 'చెన్నై స్టోరీ' విషయంలో జరిగినట్లు తెలుస్తున్నది. ఈ ఇంటర్నేషనల్ ప్రాజెక్ట్‌లో తొలుత సమంతను కథానాయికగా ఎంపిక చేశారు. ప్రస్తుతం ఆమె ప్రెగ్నెన్సీ కారణంగా సినిమాలకు విరామం తీసుకుంటున్న విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో సమంత స్థానంలో శృతిహాసన్‌ను కథానాయికగా ఎంపిక చేశారని వార్తలు వినిపిస్తున్నాయి. బాఫ్టా అవార్డు విజేత, డౌన్‌టౌన్ అబ్బే వంటి సినిమాలతో అంతర్జాతీయ గుర్తింపు తెచ్చుకున్న ఫిలిప్‌జాన్ దర్శకత్వంలో 'చెన్నై స్టోరీ' తెరకెక్కుతున్నది. టిమెరి ఎన్ మురారి రచించిన 'ది అరెంజ్‌మెంట్స్ ఆఫ్ లవ్' నవల ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. చెన్నై, ఇంగ్లాడ్‌లోని వేల్స్ నేపథ్యంలో సాగే ఈ కథలో కథానాయిక ప్రైవేట్ డిటెక్టివ్ పాత్రలో కనిపించనుంది. అయితే ఈ సినిమా నుంచి సమంత తప్పుకున్న విషయాన్ని అధికారికంగా ధృవీకరించలేదు. అంతర్జాతీయ నటీనటులతో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు.

# అక్టోబర్‌లో వస్తున్న 'కల్ట్'



విశ్వక్‌సేన్ నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'కల్ట్' చిత్రాన్ని అక్టోబర్ 30న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. సందీప్ కాకర్ల నిర్మాత. నిజ జీవిత సంఘటనల స్ఫూర్తితో స్లాషర్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలు సినిమాపై ఆసక్తిని పెంచాయి. శనివారం రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ సందర్భంగా కొత్త గ్లింప్స్‌ను విడుదల చేశారు.ఇందులో హీరో విశ్వక్‌సేన్ ఇంటెన్స్ లుక్స్‌తో నెగెటివ్ షేడ్స్ ఉన్న క్యారెక్టర్‌లో కనిపించారు. ఎడ్జ్ ఆఫ్ ది సీట్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినందిస్తుందని మేకర్స్ తెలిపారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, జపనీస్, స్పానిష్ భాషల్లో విడుదలకానున్న ఈ చిత్రానికి తరుణ్ భాస్కర్ సంభాషణలు అందిస్తుండగా, రవిబస్రూర్ సంగీతాన్ని సమకూర్చుతున్నారు.

# 'కదిరి కాళిదాస్'.. 'కాకా' నుంచి మెగాస్టార్ క్రేజీ అప్‌డేట్!




మెగాస్టార్ చిరంజీవి , మాస్ డైరెక్టర్ బాబీ కొల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కాకా'. 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. తాజాగా ఈ చిత్రంలో తన పాత్రకు సంబంధించి లీక్స్ ఇచ్చాడు చిరంజీవి. ఇటీవల జరిగిన ఓ సినిమా వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మెగాస్టార్ చిరంజీవి, స్టేజ్ పై సరదాగా మాట్లాడుతూ తన పాత్రకు సంబంధించి కొన్ని ఆసక్తికర హింట్స్ ఇచ్చారు. ఈ చిత్రంలో ఆయన 'కదిరి కాళిదాస్' అలియాస్ 'సత్యం' అనే విభిన్నమైన షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తోంది. పైకి సాధారణ ప్రజలకోసం ఓ ఆక్వా ఫ్యాక్టరీలో సూపర్‌వైజర్‌గా పనిచేసే సాధారణ వ్యక్తిలా సత్యం కనిపిస్తారని, కానీ తెరవెనుక అండర్‌వాల్డ్‌ను శాసించే శక్తిగా 'కదిరి కాళిదాస్' రూపంలో ఆయన అసలు నిజస్వరూపం బట్టబయలవుతుందని సమాచారం. ఈ చిత్రంలో తండ్రీకూతుళ్ల మధ్య వచ్చే బలమైన భావోద్వేగాలు కథకు ప్రధాన ఆత్మగా నిలవనున్నాయి. మలయాళీ నటి అనస్వర రాజన్ చిరంజీవి కూతురు 'అమ్ములు' పాత్రలో నటిస్తుండగా, ఆమె మెడిసిన్ చదివే విద్యార్థినిగా కనిపించనుంది. వీరిద్దరి మధ్య నడిచే ఎమోషనల్ బాండింగ్ ప్రేక్షకులను కంటతడి పెట్టించడంతో పాటు సినిమాకే హైలైట్‌గా మారుతుందని చిత్ర యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అన్ని హంగులు పూర్తి చేసుకుని ఈ పవర్ ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను 2027 సంక్రాంతి కానుకగా జనవరి 13న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయడానికి మేకర్స్ పక్కా ప్రణాళికతో సన్నాహాలు చేస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ అప్‌డేట్ కూడా రానుండటంతో మెగా అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# అందానికి అమ్మమ్మ చిట్కా

'ఛలో' సినిమాతో టాలీవుడ్‌లో అడుగుపెట్టిన కన్నడ కస్తూరి రష్మిక మందన్న. ఈ ముద్దుగుమ్మ హీరో విజయ్ దేవరకొండను పెండ్లి చేసుకొని తెలంగాణ కోడలైంది. పుష్ప లాంటి బ్లాక్‌బస్టర్‌లో నటించిన రష్మిక తన భర్త విజయ్‌తో కలిసి 'రణబాలి'లో జతకట్టింది. ముచ్చటగా మూడోసారి దేవరకొండతో నటిస్తున్నా.. పెండ్లి తర్వాత ఈ జంట కలిసి చేస్తున్న మొదటి చిత్రం ఇదే కావడం విశేషం. ఈ సందర్భంగా ఈ బ్యూటీ పంచుకున్న కార్‌వాన్ కబుర్లివి..ఇటీవల షూటింగ్‌లో గాయపడటంతో ఇంటికే పరిమితమయ్యాను. ఇన్నిరోజులు ఇంట్లో ఉండటం నా కెరీర్‌లోనే మొదటిసారి అనుకుంటా. షూటింగ్‌ల వల్ల నిత్యం ఒక చోటు నుంచి మరో చోటుకు వెళ్లే నాకు ఇదో కొత్త అనుభవం. పెండ్లయిన తర్వాత కూడా విజయ్, నేను మూడు నెలలపాటు ఒకరినొకరం చూసుకోలేదు. పెండ్లి తర్వాత ఇంట్లోవాళ్లతో గడిపే అవకాశం లభించినందుకు ఒకింత సంతోషంగా ఉంది .రణబాలితో పాటు 'మైసా'లో లీడ్ రోల్ చేస్తున్నాను. ఇందులో గోండు తెగకు చెందిన వారియర్‌లా కనిపిస్తాను. ఈ పాత్ర కోసం శారీరకంగా, మానసికంగా ఎంతో కఠిన శిక్షణ తీసుకున్నాను. ఇందులో నీటి అడుగున శ్వాస బిగబట్టి చేసే యాక్షన్ సీన్ చేశాను. ఆసియాలోనే ఈ తరహా సీన్ చేసిన తొలి ఫీమేల్ యాక్టర్ నేనే అనుకుంటా. దేవరకొండ కుటుంబంలో భాగమైనందుకు ఆనందంగా ఉంది. మా అత్త స్వీట్‌గా, పసిపాపలాగా అమాయకంగా ఉంటుందని నేను ముద్దుగా ఆమెను 'పాపా' అని పిలుస్తాను. విజయ్‌కు సీరియస్ డ్రామాలు, షోలంటే ఇష్టం. నాకేమో కొరియన్ డ్రామాలు అంటే పిచ్చి. ఇప్పుడు ఆయనకు కూడా కే-డ్రామాలు అలవాటు చేశాను. నా దృష్టిలో సక్సెస్ అంటే పర్‌ఫెక్ట్ ఇమేజ్ కాదు. ఎంత ఎదుగుతున్నా సరే మనం మనలా ఉంటూ ప్రేక్షకులతో నిజాయతీగా ఉండటమే. అలాంటి నిజాయతీని ఎప్పటికైనా ప్రేక్షకులు గుర్తిస్తారు. బిజీ షెడ్యూల్లో కాస్త తీరిక దొరికినప్పుడు స్కిన్, హెయిర్ కేర్ గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాను. గోరు వెచ్చని కొబ్బరి నూనెను ముఖానికి, తలకు పట్టించి చక్కగా మర్దనా చేసుకుంటా. ఏ మాయిశ్చరైజర్, హెయిర్ కండీషనర్ అవసరం లేదు. వీలు దొరికినప్పుడల్లా నేను ఇదే చేస్తా. ఇది మా అమ్మమ్మ, అమ్మ చెప్పిన చిట్కా.



# హనుమాన్ అంశ్' దర్శకుడి కొత్త సినిమా

ఇటీవల విడుదలైన ఆధ్యాత్మిక చిత్రం 'హనుమాన్ అంశ్'తో దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించారు దర్శకుడు విశాల్ చతుర్వేది. నీమ్ కరోలి బాబా జీవితం ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రం 300కోట్లకు పైగా వసూళ్లతో భారతీయ బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్నది.ఈ నేపథ్యంలో దర్శకుడు విశాల్ చతుర్వేది కొత్త చిత్రాన్ని ప్రకటించారు.. మహాకవి గోస్వామి తులసీదాస్ జీవిత కథతో ఆయన ఈ చిత్రాన్ని రూపొందించబోతున్నారు. దీనికి 'రాంబోలా- ది ఇమ్మోర్టల్ స్టోరీ ఆఫ్ గోస్వామి తులసీదాస్' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. తులసీదాస్ జీవిత ప్రయాణం, సాహిత్య సేవ, సమాజంపై ఆయన ప్రభావం వంటి అంశాలను చర్చిస్తూ ఈ సినిమాను తెరకెక్కించబోతున్నారు


Published and Owned by Katta Hima Pavani Published 19-8-35A,6th Lane, Old Raja Rajeshwaripeta, Vijayawada, NTR district, Andhrapradesh-520001 Printed at Neti Darshini Publications H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505, Editor: Katta Hima Pavani, PRGI NO: APTEL/26/A5450